# నీటి బుడగలు

(కథానిక)

బతుకులో ఎలాంటి సౌఖ్యమూ లేదు.

ఈ మాట రవణ వెయ్యిసార్లయినా అనుకుంటాడు. అందులోనూ వెనకబలగం వున్నవాడి జీవితం చిల్లి నిక్కూడా చెల్లదు. తను ఒంటరిగాడు కనక ఏ బాధాలేదు. ఎక్కడో ఆకాశంలో - సాయంత్రంవున్న రక్తసిక్త కాంతి పుంజాలు తన ఆశాజ్యోతికి జ్యోతి వెలిగించాలని తను అనుకుంటే లాభమేముంది? తనకుమాత్రం కంకర రాళ్ళమీద నడకతప్పదు.

జీవితం దుఃఖమయం.

అంతా అలా అనుకుంటారా? లేక తనబోటి వాడికే ఈ బాధా? ఎంత చెట్టుకంత గాలి. వెధవది..పగలంతా యంత్రంలా తిరిగినా రాత్రి తనకు నిద్రరాకుండా - చైనాగోడల్లా ఈ ఆలోచనల అడ్డంకులేవిటి? ఎవరో తలుపు తడుతున్నారు.

నిజానికి రవణకు నవ్వొచ్చింది. జీవితాన్నంతా పుక్కిలించి వుమ్మేసినట్టు నవ్వాడు. తనింటి తలుపు ఈ నిశిరాత్రిలో తట్టేదెవరు?

"ఎవరది?" అన్నాడు.

"నేనండి. కమలను - ఒక్కసారి తలుపు తీయండి."

రవణకు గుండె గుభేలుమంది...బాబోయ్! చీకటిలో మునిగి తేలుతుంటే ఈ ఎర్రతామ రెందుకిక్కడ?...అందులోనూ అర్థరాత్రి తలుపు తీయమనటంలో అర్థం? సిగరెట్టు పొగలా ఆలోచనలు తిరుగుతున్నాయి. తలుపురెక్క కిర్రుమంది.

కమల బెదురుతూ లోపల అడుగుపెట్టి తలుపు వేసింది. ఆమె ముఖంలోంచి అమావాస్య తొంగిచూచి నవ్వింది. ఎందుకో ఆమె శరీరమంతా చిన్నగా వణుకుతోంది. కమల తనతో ఒంటరిగా వుండటం ఇదే మొదటి సారి.

"మా నాన్నకు చాలా యిదిగా వుందండి. అయిదునిమిషాలు అదేపనిగా దగ్గురావటంవలన వళ్ళు తెలియకుండా పడిపోయాడు..మీరు వెంటనే రావాలండి. నాకు భయంగావుంది..నాన్న లేకపోతే నా గతేమిటి?..." రెండు చేతుల్తో మొహం కప్పేసుకుంది.

"అలా చిన్నపిల్లలా ఏడుస్తే యెలాగ?... ధైర్యంగా వుండాలి మరి..మీ నాన్నకేం ఫర్వాలేదు. కష్టాలు ఇంకెవరికొస్తాయి?.నడు" అన్నాడు.

ఇది రోజూ పాడుతున్న రికార్డు.

తలుపురెక్క కిర్రుమంది. ఇద్దరూ చీకట్లో మునిగిపోయారు.

ఇద్దరూ ఇంటికొచ్చేసరికి వెంకట్రావుకు కొంచెం తెలివి వచ్చింది. ఇద్దర్నీ గుర్తించాడు. దగ్గరగా రమ్మని - కూర్చోమని సైగచేశాడు. కమల భయంతో గోడకు చేరబడి పోయింది. పాతాళానికి తోసేస్తానని బెదిరిస్తున్న కుర్చీలో రవణ కూర్చున్నాడు.

"ఐపోయింది...నా బతుకు అయిపోయింది." ఏదో పిచ్చివాగుడు.

"మరేం భయపడకండి... నేనున్నానుగా. కంగారుపడి కమలను గాభరా యెత్తించకండి... మీకు నయమవుతుంది."

"ఇంకెక్కడ నయంకావటం? ఇంక ఒక్కటే. నా కమల గతేమిటి?...దాన్నెవరు చూస్తారు? అయ్యో!...ఏంచేయను?"

మళ్ళీ అదే వాగుడు. ఇతన్తో ఎలాగ?

"కమలసంగతి నేను చూసుకుంటానండి... మీకెందుకు వృథా విచారం? మీరిలా సతమతమవుతే ఎలా నయమవుతుంది?"

"రవణోయ్!... నువ్వు కుర్రాడివి... నీకేం తెలుసు? లోకం సంగతి నీకు తెలియదు. కమలను మాత్రం వదలకు...ఏదీ-ఇలా అని చేతిలో చెయ్యి వెయ్యి."

రవణ అలానే చేశాడు. ఎదురుగా ఎత్తుగా వున్న గోడ తన్ను వెక్కిరించింది. అవునుమరి. అందర్నీ గోడలే వెక్కిరిస్తాయి... ఒక్కతాపు

ఆర్. ఎమ్. చిదంబరం

కస్తే?...తనే వెనక్కి వస్తాడు. వెంకట్రావు వికారంగా నవ్వి ఏమీ తెలియని స్థితిలో పడిపోయాడు.

"ఇదుగో కమలా!... ఎందుకలా అయిపోతావ్? మీనాన్న ఏమీ అయిపోడులే!"

తనేదో అంటున్నాడు. కాని తనకుమాత్రం తెలియదూ-వెంకట్రావు బతకడని. అసలతను పదిరోజుల క్రితం పోవలసినవాడే.

ఆవేళ రాత్రి నిద్రపట్టలేదు. కమలమాత్రం గోడకి జేరబడి కునుకు తీస్తోంది. నిద్రలో ఆమె ముఖం మధ్య మధ్య కళలు మార్చుకుంటోంది. భయానకంగా - వికృతంగా తయారవుతోంది. ఆమె అంతరాంతరాల్లో ఎలాంటి సంఘర్షణ జరుగుతోందో! కొంపతీసి "సోంనాంబ్యులిజం" ప్రదర్శించదుకదా!

ఆలోచనలు అలల్లా పెరిగి పోతున్నాయి. రాతికి గుద్దుకుని అలలు చిందర వందరైనట్టు ఏదో అడ్డంకువచ్చి తన ఆశలన్నీ చెల్లాచెదరవుతున్నాయి. కమలను తను ఎలా చూడగలడు? నలుగురూ నాలుగుమాటలూ అంటారు. చంద్రగ్రహణానికి శాస్త్రజ్ఞులు చెప్పే కారణం పుస్తకాల్లో దాక్కుంటుంది...ఎలాగ? పోనీ కమలను పెళ్ళిచేసుకుంటే? తనలో తాను నవ్వుకున్నాడు.

తనకు పెళ్ళేమిటి? రెండుకడుపులు నిండాలి. ఒకటి నిండటానికే నానాయాతనలూ పడాల్సొంది. ఎలాగ?...కమల నేంచేయటం?

"బాబోయ్!" అంటూ మేల్కొన్నాడు వెంకట్రావు.

బయట రాక్షసిలా తిరుగుతున్న గాలి జివ్వుమని నేపథ్యంలో పలికింది.

ఇద్దరూ వులిక్కిపడ్డారు.

"ఏమో!...అబ్బా!...గోడమీద యేవో... భయంగావుంది."

గోడమీదేముంది? మాసిపోయినపంచె, చిరుగు కోటు, తువాలు, దండెంమీదనుంచి వేలాడుతున్నాయి. అంతా కళ్లల్లోవుంది.

"అమ్మో! ... కమల్ని ఒది...లే...ను... బాబోయ్!" దగ్గు తెర బిరబిర వచ్చేసింది. గుడ్డి దీపం ఆరిపోయింది. కమల గొల్లుమంది-రవణ గుండె జల్లుమంది. అనుకున్నంతా అయింది.

ఇద్దరికీ వెంకట్రావు బతకడని తెలుసు-ఐనా ఎందుకీయేడుపు?

కమల తనివితీరా ఏడ్చింది-ఒద్దని తను అనలేదు. అంటే లాభం?...తనకు కళ్ళ నీళ్ళు ఆగుతున్నాయా?

* * *

కమల పూర్తిగా మారిపోయింది. సరిగ్గా పదిహేనురోజుల్లో మారిపోయింది. మారిపోతుందని తనకూ తెలుసు-తనతో మాట్లాడదు. మాట్లాడాలని తను అనుకోనూలేదు. వెంకట్రావు బొత్తిగా అన్యాయం చేసిపోలేదు. మూడునెల్లు నిక్షేపంగా గడవటానికి కావలసిన గ్రాసమంతా సమకూర్చిపోయాడు. ఓ యాభైరూపాయలు ఇచ్చిపోయాడు. ప్చ్!.....అదేమూల! ఏనుగుముందు ఈగలాగ!

పడక్కుర్చీలో పడుకుని మామూలు ఆలోచనలు చేస్తున్నాడు.

"ఏమండోయ్!.....టెలిగ్రాం వచ్చింది" అన్నాడు టెలిగ్రాఫ్ ప్యూన్. సంతకంచేసి పుచ్చుకున్నాక అతనికి టెలిగ్రాం వచ్చినందుకు ఆశ్చర్యం కలిగింది.

తన కెవరున్నారని టెలిగ్రాం యివ్వటానికి?

చూడగానే ఆశ్చర్యం ఎక్కువైంది. మావయ్యకు సీరియస్‌గా వుందని వెంటనే రమ్మని టెలిగ్రాం-ఈ సంగతి చదువుకున్నాక తనకు గుండె ఆగినా ఆగవచ్చు. తప్పేముంది? ఎప్పటి మావయ్య?...అతనికి తను జ్ఞాపకముండటమేమిటి? వెళ్ళాలా, అక్కర్లేదా అన్న ఆలోచనకు తావు లేకపోయింది. ఆ రాత్రి బండిలోనే బయలుదేరాడు-కమలతో చెప్పలేదు. చెప్పాలన్న ఆలోచన తట్టనేలేదు.

రైలు పరుగెడుతోంది. వెధవది-అదికూడా నల్లటిపొగ వదలటమే! ఎక్కడ కెళ్ళినా ఈ నల్లరంగు తప్పటంలేదు. ఒక్కసారి వెనక్కి చూసుకుంటే రెండు కుటుంబాలమధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. తన అమ్మమ్మ దీనికి కారణంగా ఏదో కథ చెబుతూండేది. ఇద్దరికీ ఏవేవో మాట పట్టింపులు వచ్చాయట. మొహాలు చూసుకోటం మానేశారట. ఇంకా ఏవో— ఏవో...కాని మావయ్య మాత్రం మంచి

స్థితిలో కొచ్చాడట. అదీ అతని క్వాలిఫికేషన్. తన కుటుంబానికి మాత్రం ఆవగింజంతైనా సాయంచేయలేదు. చేసినా తనతండ్రి పుచ్చుకునే మనస్తత్వంకలవాడు కూడాకాదు.

వెళ్ళేసరికి మావయ్య ప్రమాదస్థితిలోనే వున్నాడు. చూసి చాలాకాలమవటంవలన రూపంలో మావయ్య పరాయివాడిలాగే కనిపించాడు. తన్ను గుర్తించాడు. ఏవేవో పిచ్చిగా వాగాడు. తను తన కుటుంబానికి ఎలాంటి ద్రోహంచేశాడో వివరించి ఎంతోబాధ కనబర్చాడు. అయినా చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏంలాభం?...

మావయ్యపోయి పదిహేనురోజులైంది. కమలకు మాత్రం తను ఫలానాచోట వుంటున్నానని వుత్తరంరాశాడు. కాని జవాబురాలేదు. తను ఆశించలేదుకూడా. ఆమెకు అవసరముంటుందని పంపిన వందరూపాయల మణియార్డరు తిరిగి వచ్చింది. తనంటే ఇష్టంలేకో - ఆత్మాభిమానం వలనో - నలుగురి నోళ్ళకూ జడిసో-తిప్పేసుంటుందని భావించాడు. ఒకరోజు రాత్రంతా కూర్చుని కమలనుగురించి ఆలోచించాడు. ఆమె తత్వం అర్థంకాలేదతనికి.

ఇంక మావయ్య తనకు ఆస్తినిస్తూ కోరిన కోరిక - తను పద్మను పెళ్ళిచేసుకోవాలని. అది అసాధ్యం-పద్మ వుత్తరధ్రువమైతే తను దక్షిణ ధ్రువం-అదీకాక బంగారు గజ్జెలు మ్రోగించే పద్మకూ-సంస్కారాన్ని వరించలేక దూరమవుతున్న తనకూ వివాహమవటం ఎంత హాస్యాస్పదం?

“రెండు దారాల్ని కలిపినప్పుడు అతుకు కనిపిస్తే రామోలాగ? అని తెగిపోతుంది” అనుకున్నాడు రవణ. అదీకాక - మావయ్య ఆస్తంతా తనకిచ్చాడని అత్తకూ - పద్మకూ - లోపల-పైన కూడా బాంబు పేలుతున్నట్టుంది - అందుకు కారణంలేకపోలేదు. మావయ్యమీద కాక అతని డబ్బుమీద-తల్లీ కూతుళ్ళకు ప్రేమెక్కువ. ఆసంగతి రవణకు బాగా తెలుసు. కురూపిగావున్న మావయ్యను అందంగావున్న అత్తయ్య ఎందుకు పెళ్ళిచేసుకున్నది?

అతను పడకకుర్చీలో కూర్చుని యథారీతిగా ఆలోచించుకున్నాడు. ఈ ఎడతెగని ఆలోచన-ప్రయోజనంలేనిపని తనకు పరిపాటైపోయింది. పద్మ టకటకమని మెట్లు ఎక్కుతోంది.

“ఎక్కణ్నుంచి పద్మా!” అన్నాడు అరువు నవ్వు మొహంమీదికి తెచ్చుకుంటూ రవణ.

పద్మ కోపంగా చూసింది. ఆమె డ్రెస్సింగ్ చూస్తుంటే రవణకు అసహ్యం-నవ్వు కలిగాయి-ఆమె దేవతావస్త్రాలు అతన్ని వెక్కిరించాయి.

“అబ్బే!...నువ్వు ఎక్కడికి వెళ్ళిందీ తెలియకపోవటంవలన అడిగాను” అన్నాడు క్షమాపణకంఠంతో.

“అవును మరి...సర్వాధికారివి కనక అన్నీ నీతో చెప్పాలి” అనేసి టకటకమని పోయింది. ఆ మాటల వెనుక ఎన్ని మహాకీలాగ్నిజ్వాలలు రేగుతున్నాయో-ఆ టకటకల వెనక ఎలాంటి ప్రతీకారవాంఛా జనితా సర్పం బుసలు కొడుతోందో తనకు తెలుసు.

“ఈ పద్మకూ-తనకూనా పెళ్ళి?” అనుకుని నవ్వుకున్నాడు రవణ.

“అసలు మీనాన్న కొకడికి మనమీద ప్రేముండేసింది? అందుకే మనల్ని దాసీల్ని చేశాడు” అన్న అత్త అహంకారపూరిత వాక్కులు చెవుల్లోకి దూసుకుపోయాయి. ఇద్దరు ముగ్గురు తన దగ్గరకొచ్చి ఏదో దీనగాథ విలపించి డబ్బిమ్మంటే ఇచ్చేశాడు. అదే పెద్ద రభసకు-మనస్సులో విషవృక్షం పెరగటానికి కారణమైంది. అయినా ఈ డబ్బు తనకెందుకు? డబ్బుంటే బతుకు మహా బాగావుంటుందని తాను పొరబడ్డాడు గామోలు. అందుకోసం ఎంతమంది కాసుక్కూచుంటారో!

ఆ రాత్రి జ్వరం వచ్చేసరికి రవణకు గుండె ఆగిపోయినట్టయింది. దుక్కలా వున్నప్పుడే కాల్చుకుతింటే ఇప్పుడెవరు చూస్తారు?...అటు కమల తనను గురించి ఏమనుకుంటోందో!... బహుశా నూరుపాళ్ళు తన్ను అసహ్యించుకుంటుంది.

మర్నాడే ఆస్తంతా అత్తయ్యకిచ్చేటట్టు వాగ్దానం చేశాడు. అంతా ఆమెపేర ట్రాన్స్ఫర్ చేయించి ఇంటికి బయలుదేరేసరికి రైలుబండితో బాటు తనకూ “కూ” అనాలనిపించింది.

ఇంతకూ కమల ఏమంటుందో!...తనను లోకంలో ఎవరాహ్వానిస్తారు?

★